పోలీసుశాఖ అందించే సేవలపై అవగాహన కల్పించేందుకే ఓపెన్ హౌస్

జిల్లా ఎస్పీ దీపిక

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసు పరేడ్ గ్రౌండులో ఓపెన్ హౌస్ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ఎం. దీపిక ముఖ్య అతిథిగా హాజరై, భాష్యం స్కూలు విద్యార్థినితో 'ఓపెన్ హౌస్' కార్యక్రమాన్ని ప్రారంభింపజేసారు. అనంతరం జిల్లా ఎస్పీ ఎం. దీపిక మరియు ఇతర పోలీసు అధికారులు 'ఓపెన్ హౌస్'ను సందర్శించి, విద్యార్థులతో మమేకమై, అప్యాయంగా మాట్లాడి, పోలీసుశాఖ నిర్వహించే వివిధ ఆయుధాలు, అత్యాధునిక పరికరాలు పట్ల అవగాహన కల్పించి, వారిలో స్ఫూర్తి నింపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎం. దీపిక మాట్లాడుతూ - విధి నిర్వహణలో తీవ్రవాదులతో పోరాడుతూ ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమర వీరుల సంస్మరణార్థం ఈ రోజున "ఓపెన్ హౌస్" కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ 'ఓపెన్ హౌస్'లో పోలీసుశాఖ కేసులు ఛేధనలో ఉపయోగించే సాంకేతికత, కమ్యూనికేషన్, బాంబ్ డిటెక్షన్, డిస్పోజల్, వివిధ ఆయుధాలు, డ్రోన్స్ వినియోగం, వేలి ముద్రల సేకరణ, బాడివార్న్ కెమెరాలు, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్, ట్రాఫిక్ పోలీసులు వినియోగించే బ్రీత్ ఎనలైజర్స్ మరియు ఇతర పరికాలు, నేర పరిశోధనలోను, బాంబ్లను గుర్తించడంలో పోలీసు డాగ్స్ పని తీరు, బాంబ్ డిస్పోజల్ పరికరాలు, దిశ యాప్ గురించి విద్యార్థులకు, ప్రజలకు ఆసక్తి కలిగే రీతిలో వివరించామన్నారు. విద్యార్థుల్లో పోలీసుశాఖ పట్ల ఆసక్తి పెంచేందుకుగాను ఎన్నడూ లేని విధంగా విద్యార్థులకు కొన్ని ప్రశ్నలు వేసి, వాటికి సరైన జవాబులు చెప్పిన విద్యార్థులకు ఎ.కే. 47 ఆయుధంతో ఫోటోలు తీయించి, వాటిని విద్యార్థులకు బహూకరించారు. అదే విధంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని తిలకించేందుకు విచ్చేసిన భాష్యం, సెయింట్ జోసెఫ్, మున్సిపల్ హైస్కూలు, శ్రీ చైతన్య విద్యార్థులతో జిల్లా ఎస్పీ ఎం.దీపిక గ్రూపు ఫోటోలు దిగి, విద్యార్థుల్లో చైతన్యం నింపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, సెబ్ అదనపు ఎస్పీ ఎస్.వెంకటరావు, ఎస్బీ సిఐలు కే.కే.వి. విజయనాధ్, ఈ.నర్సింహమూర్తి, డిసిఆర్బి సిఐ జె. మురళి, విజయనగరం రూరల్ సిఐ టి.వి. తిరుపతిరావు, దిశ సిఐ బి. నాగేశ్వర రావు, ఆర్.ఐ. ఎన్.గోపాల నాయుడు, ఎఆర్ మరియు సివిల్ పోలీసు అధికారులు, సిబ్బంది, వివిధ విభాగాల పోలీసు సిబ్బంది, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ అర్హుల జాబితా ప్రదర్శన

విశాలాంధ్ర - నెల్లిమర్ల : రైతుల ఈక్రాప్ అర్హుల జాబితాను సచివాలయాలలో ప్రదర్శిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎం పూర్ణిమ వెల్లడించారు. నెల్లిమర్ల మండలం సారిపల్లిలో సామాజిక తనిఖీ కోసం ఈ క్రాప్ అర్హుల జాబితా గురువారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 26 నుంచి 29 వరకూ రైతుభరోసా కేంద్రాలలో అర్హుల ఈ క్రాప్ జాబితా అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. రైతుల పేర్లు, సర్వే నెంబర్లు, పంటల సాగు, విస్తీర్ణంలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. నవంబరు 1న తుది జాబితా రైతుభరోసా కేంద్రంలో ప్రదర్శించనున్నట్లు చెప్పారు.

సుందరాడలో అట్రాసిటీ కేసు నమోదు

విశాలాంధ్ర - (తెర్లాం): మండలంలో సుందరాడ లో అట్రాసిటీ, పోక్సో కేసులు నమోదైనట్లు ఇంచార్జి ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే సుందరాడ గ్రామం లో బుధవారం రాత్రి దుర్గాదేవి విగ్రహ నిమజ్జనంలో భాగంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ వర్గానికి చెందిన నరేష్ అని యువకుడు ఓ బాలికకు ఫోటోలు తీసి, ఫోన్ నెంబర్ అడిగాడు అని పేర్కొని బాలిక బంధువులు నరేష్ పై చేయి చేసుకున్నారు. నరేష్ ను ఎందుకు కొట్టారని ఆయన బంధువులు బుధవారం బాలిక బంధువులను నిలదీశారు.బాలిక బంధువులు తనతో పాటు మరికొందరు పై దాడి చేశారని నరేష్ ఫిర్యాదు చేశాడు దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ తెలిపారు.అలాగే బాలిక ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గురువారం ఆ గ్రామం లో ఎటువంటి అలర్లు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి పికెట్ కొనసాగించాలని బొబ్బిలి సిఐ తిరుమలరావు ఎస్ఐ సురేంద్ర నాయుడు కు ఆదేశించారు అని విలేకర్ల తో తెలిపారు.

ఈ క్రాప్ పై సోషల్ ఆడిట్

విశాలాంధ్ర - గరివిడి : మండలంలో మందిరవలస గ్రామంలో గత కొద్దిరోజుల క్రితం ఈ క్రాప్ నమోదు కార్య క్రమం ప్రభుత్వం నిర్వహించింది. ఈ క్రాప్లో నమోదైన రైతులు వివరాలను ఆ గ్రామ సచివాలయంలో సోషల్ ఆడిట్ కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి వీ.టి. రామారావు, చీపురుపల్లి ఏడిఏ ఎన్. కోటేశ్వరరావు, గరివిడి మండల వ్యవసాయ అధికారిని వి.శైలజ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులకు, రైతులకు ఎటు వంటి అభ్యంతరం ఉన్న అధికారులకు తెలిపితే వాటిని పరిష్కరిస్తామని గ్రామస్తులకు తెలిపారు.

ఎమ్మెల్యే శంబంగి చినఅప్పలనాయుడుకు ఘన సన్మానం

విశాలాంధ్ర - బొబ్బిలి : పురపాలక సంఘం పరిధిలో గల నాయుడు కాలనిలో మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరగడంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కీలకపాత్ర పోషించి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని నాయుడు కాలనీ ప్రతినిధులు తెలిపారు. బుధవారం రాత్రి నాయుడు కాలనీ ప్రజానీకం నిర్వహించిన అభినందన సభకు ఎమ్మెల్యే శంబంగి ని ముఖ్య అతిథిగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు.గత ప్రభుత్వాలు హయాంలో నాయుడు కాలనీ అభివృద్ధికి నోచుకోలేదని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో ఎమ్మెల్యే శంబంగి ఆధ్వర్యంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాలుగు సంవత్సరాల్లో అనేక అభివృద్ధి పనులు నాయుడు కాలనిలో జరగడం హర్షించదగ్గ పరిణామమని పేర్కొన్నారు.గత 20 సంవత్సరాల్లో పాలకులు నాయుడు కాలనీని చిన్న చూపు చూడటంతో ఎలాంటి అభివృద్ధి జరగకపోగా కాలనీ ప్రజలు చాలా ఇబ్బందుకు గురి అయ్యారని, వైసీపీ ప్రభుత్వ హయాంలో నాయుడు కాలనిలో జరిగి ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ రావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, బలగ సాయికృష్ణ, పోల అరుణ్, కర్రీ సత్యనారాయణ, జాగరవు శ్రీనివాసరావు, కాలనిలో పలువురు పెద్దలు పాల్గొన్నారు.

నిర్ణీత సమయానికి సిరిమాను రధాన్ని సిద్ధం చేయాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : అందరి సహకారంతో నిర్ణీత సమయానికి సిరిమాను రధాన్ని సిద్ధం చేసేందుకు అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం పైడితల్లమ్మ కళ్యాణమండపంలో పైడిమాంబ సేవా సంఘం, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని చేపట్టారు. గత సంవత్సరం సిరిమాను ఊరేగింపు ఆలస్యం కావడానికి గల కారణాలపై సమీక్షించారు. సిరిమాను శీల బిగింపు, కట్లు కట్టడం, ఇరుసుమానుకు సిరిమానును అమర్చడం వంటివి నిర్మాణపు ప్రక్రియలు నిర్ణీత సమయాన్ని కల్లా పూర్తి చేసే విధంగా చూడాలని హుకుంపేటలోని జాతర ప్రక్రియలో భాగస్వామ్యం అయిన వారికి సూచించారు. సిరిమానుతో పాటు రధాలు తిరిగే సమయంలో ఇతరులను అనుమతించకుండా తగు చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ వారికి సూచించారు. హుకుంపేట వాసులతో గత అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ అందరి సహకారంతో పైడితల్లమ్మ సిరిమాను జాతరను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన దర్శనాలు జరిగే విధంగా చూస్తున్నామన్నారు. ఈ సమావేశంలో దేవాదాయ ధర్మదాయ శాఖ ఆర్జెసి. యం.వి.సురేష్ బాబు, ఆర్డీవో సూర్యకళ, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి, డీఎస్పీలు గోవిందరావు, విశ్వనాథ్, ఆలయ ప్రధాన పూజారి బంటుపల్లి వెంకట్రావు, దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

28న టిడిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

విశాలాంధ్ర - కొత్తవలస : ఈనెల 28 శనివారం ఉదయం 9 గంటలకు శృంగవరపు కోట నియోజకవర్గం విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కనకాల శివ తెలిపారు. నియోజక వర్గం పార్టీ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహిస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే పార్టీ నియోజక వర్గ ఇన్చార్జి కోళ్ల లలిత కుమారి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కోళ్ల బుచ్చి అప్పల రాంప్రసాద్ తదితరులు ముఖ్య అతిథులుగా అవుతున్నట్లు మండల పార్టీ కార్యదర్శి కనకాల శివ తెలిపారు. సమావేశానికి కార్యకర్తలు అభిమానులు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర - భోగాపురం : బహిర్భుమికి వెళ్లి వ్యక్తి చెరువులో పడి వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఎస్ ఐ కృష్ణ మూర్తి అందించిన వివరాల ప్రకారం భోగాపురం గ్రామానికి చెందిన ఆవాల రమణ బుధవారం సాయంత్రం బయటకు వెళుతున్నానని చెప్పి వెళ్ళాడు. అతను తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు గ్రామస్తులతో కలిపి వెతికిన ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం భోగాపురం గ్రామంలో పంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న గున్నం కోనేరులో నీటిలో తేలుతూ మరణించి ఉన్నాడు. ఆవాల రమణ బుధవారం సాయంత్రం బహిర్భుమికి వెళ్లి చెరువులో పడి మరణించి ఉంటాడని అతని తండ్రి ఆవాల నర్సింగరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్/ డెంకాడ : బిసిసిఐ ఆధ్వర్యంలో జిల్లాలో ఈనెల 8 నుంచి నిర్వహించిన అండర్ 19 అంతరాష్ట్ర మహిళల వన్డే క్రికెట్ టోర్నీని విజయవంతంగా నిర్వహించడం జరిగిందని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ ఆర్ గోపీనాథ్ రెడ్డి అన్నారు. ఈ టోర్నీ నిర్వహణకు కృషి చేసిన అసోసియేషన్ సభ్యులకు, నార్త్ జోన్ క్రికెట్ అకాడమీ సిబ్బందికి విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ను ప్రత్యేకంగా అభినందించారు. మహిళా క్రికెటర్లు అంతర్జాతీయ క్రికెట్లో రాణించాలని తెలిపారు. అనంతరం టోర్నీ విజేత ముంబై క్రికెట్ జట్టుకు ట్రోఫీని అందజేశారు రన్నరప్ మహారాష్ట్ర జట్టు సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నార్త్ జోన్ క్రికెట్ అకాడమీ చైర్మన్ సన్యాసిరాజు, కన్వీనర్ పి దేవవర్మ, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎం ఎల్ఎన్.రాజు, ట్రెజరర్ వి.సీతారామరాజు, తదితరులు పాల్గొన్నారు

జగన్ ఎన్నికల ప్రచారంగా కోడి కత్తి డ్రామా



విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఆనాడు జగన్ ఎన్నికల ప్రచారంలో కోడి కత్తి డ్రామా నడిపించారని నియోజకవర్గం ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆరోపించారు గురువారం పట్టణంలోని అన్న క్యాంటీన్ వద్ద ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కోడి కత్తి డ్రామా జరిగి ఐదేళ్లు పూర్తయిందని విమర్శించారు. కోడి కత్తి కేసులో నిందితుడుగా ఉన్న శ్రీను నేటికీ విచారణ ఖైదీ గానే జైల్లోనే మగ్గుతున్నారని అన్నారు. జగన్ విచారణకు రావాలని కోర్టు ఆదేశించిన ఆన్లైన్ ద్వారా హాజరయ్యేందుకు అవకాశం కల్పించాలంటూ ఆయన తరవు పిటిషన్ లో చేయడం అత్యంత హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసీపీ నాయకులు చంద్రబాబు,లోకేష్, భువనేశ్వరి లపై నచ్చినట్లు మాట్లాడడం మాని, ముందు మీ నాయకుడిని కోడి కత్తి కేసులో కోర్టులో హాజరైతే అన్ని తేలుతాయన్నారు.అలాగే వైయస్ వివేకా హత్య కేసులో ఎంపీ అవినాష్ రెడ్డి అరెస్ట్ అయిన ఐదు నిమిషాల్లో బెయిల్ పొందారు. కానీ ఏ ఆదారాలు లేకుండా ప్రజా నాయకుడు చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి 50 రోజులుకి పైగా జైలుకే పరిమితం చేసి కనీస సదుపాయాలు కూడా కల్పించకుండా ఇబ్బందులపాలు చేయడం దుర్మార్గపు చర్య అని, భువనేశ్వరి తిరుపతి వెంకటేశ్వర స్వామి దర్శనానికి వెళితే, జబర్దస్త్ రోజా కుప్పిగంతులేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జీ.ఎస్.నాయుడు, జెడ్పీటీసీ అభ్యర్థి భీశెట్టి అరుణ, అనకాపల్లి చెల్లయ్య, కాపుగంటి వాసు,బంగారమ్మ,భీశెట్టి మోహన్, నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ పోస్టల్ కబడ్డీ జట్టు కోచ్‌గా శ్రీనివాస్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : అక్టోబర్ 30వ తేదీ నుండి నవంబర్ 2 వ తేదీ వరకు కేరళ రాష్ట్రం ఎర్నకులాం లో జరగబోయే 35 వ అల్ ఇండియా పోస్టల్ కబడ్డీ టోర్నమెంట్లో పాల్గొనబోయే ఆంధ్రప్రదేశ్ పోస్టల్ కబడ్డీ జట్టు కి కోచ్ గా విజయనగరం హెడ్ పోస్ట్ ఆఫీస్ లో ఉద్యోగం చేస్తున్న కబడ్డీ క్రీడాకారుడు శ్రీ పతివాడ శ్రీనివాస రావుని కోచ్ గా నియమిస్తూ విజయవాడ సర్కిల్ ఆఫీస్ నుండి ఉత్తర్వాలు వచ్చాయి. శ్రీనివాస రావు 1997 నుండి పలు జాతీయ పోటీలో పాల్గొని ఎన్నో పతకాలు సాధించారు ఆంధ్రప్రదేశ్ జట్టు కి కెప్టెన్ గా పలు సార్లు వ్యవహరించారు. శ్రీనివాస రావు నియామకం పట్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కార్యదర్శి ఈశ్వర్ కౌశిక్ సూరిబాబు , కబడ్డీ గురువు బొమ్మనా రామారావు తపాలా శాఖ సిబ్బంది మరియు కబడ్డీ క్రీడాకారులు అందరూ హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియచేసారు.

జగనన్న సురక్ష కార్య క్రమాన్ని సద్వినియోగ పరుచుకోవాలి

శాసనసభ్యులు జోగారావు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగ పర్చుకోవాలని శాసన సభ్యులు అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని కృష్ణపల్లి గ్రామంలో గురువారం నాడు నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శాసనసభ్యులు అలజంగి జోగారావు పాల్గొని ప్రజలకు అందిస్తున్న ఉచిత వైద్యసేవలను గురించి వైద్యులను అడిగి తెలుసుకోవడంతో పాటుగా ప్రజలకు మెడికల్ క్యాంప్లో అందిస్తున్న సౌకర్యాలు, మందులు పంపిణీ వంటి వాటిని పరిశీలించడం జరిగినది. ప్రజలు అంతా కూడా ఈ సేవలను తప్పక సద్వినియోగం చేసుకోవాలని, మీ అందరి ఆరోగ్య ప్రమాణాలు మరింత మెరుగు పరిచేందుకు ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మరింతగానో దోహద పడుతుందని ఎమ్మెల్యే ప్రజలకు పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద యెత్తున వైద్యాధికారులు, వైద్యులు, మండల అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, స్థానిక పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అయోడైజ్డ్ ఉప్పునే ఆహార పదార్థాల్లో వినియోగించాలి

విశాలాంధ్ర - బెలగాం : ప్రతీ ఒక్కరూ అయోడైజ్డ్ ఉప్పునే ఆహార పదార్థాల్లో వినియోగించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఆయన సీతానగరం మండల కేంద్రంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష పర్యవేక్షణ సందర్భంగా అయోడిన్ లోపం వల్ల ప్రబల ఆరోగ్య సమస్యలపై అక్కడ ప్రజలకు అవగాహన కల్పించారు. మనం తినే ఆహార పదార్థాల్లో వాడే ఉప్పులో అయోడిన్ తగు మోతాదులో ఉండాలన్నారు. అయోడిన్ లోపం వల్ల ముఖ్యంగా పిల్లల్లో మానసిక వృద్ధి, మనోవికాసం లోపిస్తుందని, బుద్ధి మాంద్యం కలిగే అవకాశాలు ఉంటాయన్నారు. గాయిటర్, హైపో థైరాయిడ్ వ్యాదులు సంభవిస్తాయన్నారు. గర్భస్థ పిండ అభివృద్ధి, నిర్మాణం మందగిస్తుందన్నారు. అయితే గ్రామ స్థాయిలోనే ఆరోగ్య సిబ్బంది ద్వారా మనం ఆహారంలో వినియోగించే ఉప్పులో అయోడిన్ ఉన్నదీ, లేనిదీ తనిఖీ చేయవచ్చన్నారు. అదేవిధంగా ఉప్పు వినియోగాన్ని కూడా సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలని తద్వారా హృద్రోగ సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. వీటిపై ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ జగన్మోహనరావు సిబ్బందికి సూచించారు. ఇవ్వబడిన పరీక్షల కిట్ ల ద్వారా ఉప్పులో అయోడిన్ శాతాన్ని ఆయా పరిధిలో పరీక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జె. తేరేజమ్మ, జెడ్పిటిసి ఎం.బాబూజీ, వైద్యాధికారి కె.శిరీష, స్థానిక పెద్దలు జి. సూర్యనారాయణ, ఎస్. కిరణ్ కుమార్, సూపర్ వైజర్లు ఎస్వి రమణ, జయగౌడ్, వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

ముప్పాళ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర - సీతానగరం : మండల కేంద్రంలోని రైతు ముప్పాళ కోటేశ్వరరావు (76) బుదవారం రాత్రి మృతిచెందగా గురువారం నాడు అంత్యక్రియలు నిర్వహించారు. ముప్పాళ కుటుంబ సభ్యులను పార్వతీపురం ఎమ్మెల్యే, పిఏసి కుటుంబ సభ్యులు అలజింగి జోగారావు, బొబ్బిలి టీడీపీ ఇంచార్జి, మాజీ మున్సిపల్ చైర్మన్ బేబీనాయన, పార్వతీపురం టీడీపీ ఇంచార్జి బోనేల విజయచంద్ర, రాష్ట్ర ఎస్సీకమిషన్ సభ్యురాలు ఎస్.జయమణి, డివిఎంసి సభ్యులు రామారావు మాస్టారు తదితరులు విచ్చేసి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయనతో అనుబంధాన్ని బేబీనాయన అక్కడ వారందరితో కొద్దిసేపు స్మరించికోవడం గమనార్హం.అందరితో సన్నిహిత సంబంధం కలిగిన వ్యక్తిగా కోటేశ్వరరావు చాలా మంచివ్యక్తని పలువురు కొనియాడారు. అతనికి బార్య, ఇద్దరు మగపిల్లలు యుగంధర్, నాగేశ్వరరావు, కుమార్తె రాధికలుఉన్నారు. కోటేశ్వరరావు కుటుంబసభ్యులను సీతానగరం మండలంలోని అన్నిపార్టీలు నాయకులు, ప్రజాప్రతినిదులు, పలువురు అధికారులు ,సీతానగరం,బలిజిపేట, బొబ్బిలి మండలాలకు చెందిన బందువులు,అభిమానులు, పరామర్శ చేశారు. అతని కుమారుడు యుగంధర్ జి ఎల్ పురంలో ఎస్టీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేయడంతో పలు కళాశాలల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది కూడా విచ్చేసి ప్రగాఢ సంతాపంను వ్యక్తం చేశారు.

జిల్లాకలెక్టర్‌ను కలిసిన పాలకొండ ఆర్డీఓ

విశాలాంధ్ర - పార్వతీపురం : పాలకొండ రెవిన్యూ డివిజనల్ అధికారిగా భాద్యతలు స్వీకరించిన ఎమ్. లావణ్య గురు వారం జిల్లాకలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ను మర్యాద పూర్వ కంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసారు. డివిజన్ పరిధిలోని రెవెన్యూ సమస్యలు పరిష్కారం కోసం, ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఓటర్ల నమోదు కార్యక్రమం, పోలింగు బూతుల పరిశీలన, ఎన్నికల ప్రక్రియ తదితర అంశాలపై ప్రత్యేక కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆమెకు సూచించారు. ఇంత వరకు పార్వతీపురం ఆర్డీఓ హేమలత ఇంచార్జి ఆర్డీఓగా వ్యవ హరించిన సంగతి తెలిసిందే.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - సాలూరు టౌన్ : జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ కోరారు.గురువారం సాలూరు పట్టణంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష(జెఎఎస్)కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు.జెఎఎస్ కౌంటర్లను, రిజిస్ట్రేషను, టోకెను జారీ విధానం,వైద్యులు,సిబ్బంది హాజరు, చికిత్స కోసం వచ్చిన ప్రజలు,వైద్య సేవలను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. వైద్యులు,సిబ్బంది ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు.జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) కార్యక్రమం నిరుపేదలు,దూర ప్రాంతాల ప్రజలకు ఒక గొప్ప వరమని, నిపుణులైన వైద్యులు ప్రజల వద్దకే వచ్చి వైద్య సేవలు అందించడం జరుగుతుందని వివరించారు. ప్రజలకు ఇంటివద్దే ఏడు రకాలైన వైద్య పరీక్షలు (బీపీ, మధుమేహం, రక్తహీనత, మూత్రం, మలేరియా,డెంగ్యూ, కఫం) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సెప్టెంబరు 30 నుండి వచ్చే నెల 10వ తేదీ వరకు 287 వైద్య శిబిరాలు జిల్లాలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 84 మంది ప్రత్యేక వైద్య నిపుణులు పాల్గొంటున్నారని, ఇందులో స్త్రీలకు,చిన్న పిల్లలకు, ఎముకలకు, కంటికి, ఊపిరితిత్తులకు, ముక్కు, గొంతు, చెవికి, చర్మవ్యాధులకు, దంత వైద్య నిపుణులతో పాటు శస్త్ర చికిత్స సేవలు అందించ నున్నట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదల కోసం ఉచితంగా అందించే ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.జిల్లాలో ఇప్పటి వరకు సుమారు లక్షా ఏడు వేల మంది ప్రజలు శిబిరాల్లో వైద్య సేవలు పొందారని ఆయన చెప్పారు. 11094 మందికి మధుమేహం ఉన్నట్లు, 17818 మందికి బిపి ఉన్నట్లు గుర్తించడం జరిగిందని ఆయన అన్నారు. జీవన శైలిలో మార్పులు కారణంగా ఇటువంటి అసంక్రమిత వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని వాటి పట్ల అవగాహన కల్పించడం జరుగుతోందని ఆయన వివరించారు.53531 లాబ్ టెస్టులు చేయడం జరిగిందని ఆయన వెల్లడించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహారశాలను తనిఖీ చేసి శిబిరానికి వచ్చే అందరికీ ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, రక్త హీనతతో బాధపడుతున్న వారికి అవగాహన కల్పించాలని, మునగాకు, తోటకూర, పాలకూర, గోంగూర వంటి ఆకు కూరలు పౌష్టిక ఆహారానికి మంచివని వాటిలో పోషక విలువలు తెలియజేసి, వాటి వినియోగం పెంచాలని జిల్లా కలెక్టరు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు, డాక్టర్లు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

సైకిల్ యాత్ర పూర్తిచేసినవారికి సత్కారం



విశాలాంధ్ర - పార్వతీపురం : తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ అయనకు సంఘీ భావం తెలియ జేస్తూ అక్టోబర్ 2న శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నుండి కుప్పంవరకు జరిగిన సైకిల్ యాత్ర పూర్తిచేసుకొని తిరిగివచ్చిన తెలుగుదేశం పార్టీ సైనికులకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ మంత్రివర్యులు కిమిడి కళా వెంకట్రావు ఆధ్వర్యంలో వారికీ సత్కారం చేశారు.ఈకార్యక్రమంలో పార్వతీపురం నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయ చంద్ర పాల్గొని వారి సైకిల్ యాత్రను కొనియాడి సన్మానించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

విశాలాంధ్ర - సాలూరు రూరల్ : జగనన్న ఆరోగ్య సు రక్ష కార్యక్రమం పేదలకు వరమని వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ అన్నారు. గురు వారం కూర్మరాజుపేట పంచా యతీ కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైస్ ఎంపిపి రెడ్డి. సురేష్ ప్రారంభించారు. వైద్య శిబిరాన్ని పరిశీలించి,ప్రజలకు అందుతున్న వైద్య సేవల వివరాలు తెలుసు కున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమం చారిత్రాత్మక ఘట్టమన్నారు. గ్రామాలకే స్పెషలిస్ట్ వైద్యులు తరలివచ్చి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇవ్వడం మునుపెన్నుడూ చూడలేదన్నారు. ప్రజలంతా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఎంపిడిఓ గొల్లపల్లి.పార్వతి, డిప్యూటీ డిఎం హెచ్ఓ డా..శివకుమార్, వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు అటువ్వాడ.భరత్ శ్రీనివాస్, స్థానిక వైకాపా నాయకులు కొర్రాయి.తవిటినాయుదు పాల్గొన్నారు.

విజయవాడ ధర్నాకు చెందిన గోడపత్రికల విడుదల చేసిన ఏపీటీఎఫ్ నేతలు



విశాలాంధ్ర - పార్వతీపురం : ఈనెల 29న విజయవాడలోని నిర్వహించనున్న ధర్నాకు సంబందించి గోడ పత్రి కలను ఏపీటీఎఫ్ నేతలు గురువారం విడుదల చేశారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మరడాన శివున్నాయుడు మాట్లాడుతూ ఈనెల 29న ధర్నాచౌక్ వద్ద జరగనున్న ధర్నాకు ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని, సీపీఎస్, జీపిఎస్ రద్దు చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు మరడాన శివున్నాయుదు తెలిపారు. ఆయన మాట్లాడుతూపాత పెన్షన్ పునరుద్ధరణ, వేలకోట్ల రూపాయల బకాయిల చెల్లింపు కోరుతూ రాష్ట్ర స్థాయి ధర్నాను చేపట్ట నున్నట్లు తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లు, ఉపాధ్యాయు లందరూ పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2004 ముందు నోటిఫికేషన్ - అనంతరం నియామకమైన టీచర్లకు, ఉద్యోగులకు పాత పెన్షన్ వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. టీచర్లు, ఉద్యోగులు, పెన్షనర్లకు రావాల్సిన డిఎ,డి ఆర్, పిఆర్సీబకాయిలు మరియు కొత్త డిఏ బకాయలను తక్షణమే చెల్లించాలన్నారు. సరెండర్ లీవ్ ఎన్కాష్మెంట్, మెడికల్ బిల్స్ బకాయిలు తక్షణమే చెల్లించాలన్నారు. పిఎఫ్, ఏపీ జిఎల్ఐ లోన్స్, క్లైమ్స్ తదితర బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల పట్ల సానుకూలంగా వ్యవ హరించడం లేదన్నారు. పభుత్వం తనపంథాని మార్చుకోవాలని, లేనియెడల తగినమూల్యం చెల్లించుకోవడం తప్పదన్నారు. ఈ సమావేశంలో కూర్మి నాయుడు, మధు, భాస్కరరావు, సతీష్, రమనరాజు, బిజె ప్రసాద్, ఎం శివున్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు విడుదలయ్యే వరకు పోరాటం ఆగదు

విశాలాంధ్ర - సాలూరు రూరల్ : తెలుగు రాష్ట్రాల అభివృద్ధి ప్రదాత అయిన చంద్రబాబు కు ప్రజలలో వస్తున్న విశేష ఆదరణను చూసి తట్టుకోలేక వైసీపీ ప్రభుత్వం అక్రమ కేసులలో అరెస్ట్ చేసి వేధిస్తుందని పొలిట్‌బ్యూరో సభ్యురాలు గుమ్మిడి.సంధ్యారాణి అన్నారు. రాష్ట్రం లో నియంత పాలన కొనసాగుతుందన్నారు.మండల తెదేపా అధ్యక్షుడు ఆముదాల పరమేష్ ఆధ్వర్యంలో చంద్రబాబు అక్రమ అరెస్ట్ కు నిరసనగా కురుకూటి గ్రామంలో గురువారం బాబు తో నేను కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా నియోజకవర్గ తెదేపా ఇంఛార్జ్ గుమ్మిడి సంధ్యారాణి హాజరయ్యారు. గ్రామంలో ప్రతీ ఇంటికి వెళ్లి చంద్రబాబు నాయుడుపై ప్రభుత్వం కక్షసాధింపు తో కేసులు పెట్టి జైలుకు పంపిందని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో వైకాపాకి ఓటమి తప్పదని తెలుసుకున్న జగన్మోహన్ రెడ్డి చంద్రబాబు ను అక్రమ కేసులలో అరెస్ట్ చేసి వేధిస్తుందన్నారు. అప్రజాస్వామిక అరెస్ట్ ను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎవరెన్ని కుయుక్తులు, కుతంత్రాలు పన్నిన చంద్రబాబు కడిగిన ముత్యం వలె కేసుల నుండి బయట పడతారన్నారు. చంద్రబాబు విడుదలయ్యే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని ఆమె తెలిపారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలి : కమిషనర్ శ్రీరాములనాయుడు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : పైడితల్లమ్మ సిరిమాను జాతరకు విచ్చేస్తున్న భక్తులకు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీరాముల నాయుడు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా ట్యాంక్బండ్ రోడ్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన పనులు జరిపించాలని సిబ్బందికి ఆదేశించారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వివాహన చోధకులకు అవసరమైన పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించి వాటిని చదును చేసే ప్రక్రియను రేపటిలోగా పూర్తి చేయాలని చెప్పారు. బొంకులదిబ్బ ప్రాంతంలో సురభి నాటక ప్రదర్శనలు జరగనున్న నేపథ్యంలో పరిసర ప్రాంతాలు పరిశుభ్రపరిచి సభాస్థలిని చదును చేయాలని సూచించారు. అలాగే అక్కడ ఏర్పాటు చేయనున్న పార్కింగ్ ప్రాంతాన్ని ప్రాంతాన్ని అణువుగా ఉండే విధంగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం పైడితల్లమ్మ దేవస్థానం చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించి, ఎక్కడా అపరిశుభ్ర వాతావరణ లేకుండా సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికను తక్షణమే తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశించారు. గాంధీ పార్క్ ప్రాంతంలో వాహనాలను నిలిపే స్థలాలను పరిశీలించారు. అవసరమైన సూచనలను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైడితల్లమ్మ జాతరకు చుట్టుపక్కల ప్రాంతాలు ప్రజలు అనేకమంది హాజరుకానున్నారని ఈ నేపథ్యంలో పార్కింగ్ స్థలాలు అందుబాటులో తీసుకొచ్చామన్నారు. జాతర ప్రాంతాల్లో పారిశుధ్యానికి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్లు చెప్పారు. ఎక్కడ ఎటువంటి లోటుపాట్లు లేకుండా జాతర సమయానికి అన్ని సిద్ధం చేయాలని సిబ్బందికి ఆదేశించామన్నారు. ప్రజలు కూడా సహకరించి ఎక్కడ చెత్తాచెదారాలు వేయకుండా నిర్దేశిత చెత్తకుండీలలో వ్యర్థాలను వేసి సహకరించాలని సూచించారు. ముఖ్యంగా ప్రసాద వితరణదారులు ఆయా ప్రాంతాలలో ఉన్న పారిశుధ్య పర్యవేక్షకులను సంప్రదించాలన్నారు. దీనివల్ల అవసరమైన సిబ్బందిని ఆయా ప్రాంతాలలో సమకూర్చుతామని చెప్పారు. చెత్త డబ్బాలను ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఎక్కడెక్కడ చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బయో టాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఈ దక్షిణామూర్తి, పారిశుద్ధ్య పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : నేడు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న పార్సల్ రవాణా కార్యాలయం వద్ద డిపో మేనేజర్ జె శ్రీనివాసరావు, కమర్షియల్ ఏటీఎం దివ్య ఆర్టీసీ డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవం నీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 26 నుండి నవంబర్ 25 వరకు జరగబోయే కార్గో డోర్ డెలివరీ ఉంటుందని డిపో మేనేజర్ తెలియజేశారు. అతి తక్కువ చార్జీలతో ఆర్టీసీ కార్గో సేవలను ప్రజల లోకి తీసుకుని వెళ్లే ఉద్దేశంతో ఈ మాసోత్సవాలు ఏర్పాటు చేయబడ్డాయి అని తెలిపారు. నగరం లోని ప్రజలు మరియు వ్యాపార సంస్థలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని తమ యొక్క సమయం మరియు డబ్బులను ఆదా చేసుకో వాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, సిబ్బంది మరియు సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

హౌసింగు కాలనీలను సకాలంలో పూర్తి చేయాలి

విశాలాంధ్ర - మక్కువ : మన్యం జిల్లా పార్వతీపురం మక్కువ మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన భవనాలను, హౌసింగు కాలనీలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. అభివృద్ధి పథకాల క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా జిల్లాకలెక్టరు గురువారం మక్కువ మండలంలో నవరత్నలు పేదలందరికీ ఇల్లు పథకంలో మాకు లేఅవుట్ 1 మంజుల ఇల్లు 291 పూర్తయి ఇల్లు 91 వివిధ దశలో ఉన్న ఇల్లు 200 నవంబర్ నెల చివరినాటికి పురోగతి తీసుకొని అని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఏఈ సింహాచలమని ఆదేశించడమైనది పాఠశాల భవనాలు, ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనసభద్ర లో నిర్మాణంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూలు భవనాలను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలలో రాజీలేకుండా పనులు పూర్తి చేయాలని తెలిపారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి భవనాలను విద్యార్థులకు అందుబాటులోనికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మక్కువ జగనన్న హౌసింగు లేఅవుట్ లో ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. కాలనీలో ఇండ్ల నిర్మాణ పనులను దశల వారీగా పురోగతి సాధించాలని, నూరు శాతం మంజూరైన ఇండ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు లబ్దిదారులకు అందే విధంగా చూడాలని, సబ్సిడీ ధరపై అందిస్తున్న నిర్మాణ వస్తువులు లబ్దిదారులు వినియోగించుకొనేవిధంగా వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. సిమెంటు, ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పర్యటనకార్యక్రమంలోఇంజరిగు, హౌసింగు ఏఈ సింహాచలం మక్కువ ఎం.ఆర్.ఓ సూర్యనారాయణ ఎంపీడీవో దేవకుమార్ గృహ నిర్మాణ సిబ్బంది మరియు ఇతర మండల అధికారులు పాల్గొన్నారు.

పది, ఇంటర్మీడియట్ కోర్సులకు దరఖాస్తు ఆహ్వానం

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : 2023-24 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఎపిఓపెన్ స్కూల్) పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులకు దరఖాస్తుకు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత గల అభ్యర్థులు వెంటనే వెబ్ సైట్ లో నమోదు చేసుకొని అభ్యర్థులుకు దగ్గరలో గల ఓపెన్ స్కూల్ సెంటర్ లో ఒరిజినల్ సర్టిఫికెట్ లు సమర్పించి, ఫీజ్ చెల్లించి ప్రవేశము పొందవచ్చని అన్నారు. 10వ తరగతి ప్రవేశం పొందవలసిన విద్యార్థులు ఆగస్టు 31వ తేది నాటికి 14 సంవత్సరాల వయసు కలిగి ఉండాలని, అడ్మిషన్లకు రికార్డ్ షీట్ లేదా టీసీ తో పాటు అభ్యర్థి ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, తండ్రి/తల్లి ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, దివ్యాంగుల విద్యార్థులు వారి యొక్క వైద్య ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రవేశం పొందవలసిన విద్యార్థులు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని, అడ్మిషన్లకు 10వ తరగతి పాస్ సర్టిఫికెట్ తో పాటు అభ్యర్థి ఆధార్ కార్డు, బ్యాంక్ ఎకౌంట్, తండ్రి/తల్లి ఆధార్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రాలు, దివ్యాంగుల విద్యార్థులు వారి వైద్య ధ్రువీకరణ పత్రం సమర్పించాలని ఆయన వివరించారు.

పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలో అక్టోబర్ 28 నుంచి మూడు రోజులపాటు నిర్వహించే ఆనందోబ్రహ్మ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆనందోబ్రహ్మ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ పి. ఎస్. గోపాలకృష్ణ విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల జి.ఎస్. ఆర్. అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయనగరం పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సంగీతం, ధ్యానం, కూచిపూడి నృత్యాలు, అన్నమాచార్య కీర్తనలు, పాశ్చాత్య నృత్యాలు, ప్రముఖ సినీ నేపథ్య గాయకులచే సినీ సంగీత విభావరి, జబర్దస్త్ కామెడీ, మిమిక్రీ, అతిధుల సందేశాలు ఈ కార్యక్రమంలో ఉంటాయన్నారు. ప్రతిరోజు సాయంత్రం "4 నుండి "రాత్రి 10 గంటల వరకు కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. పట్నంలోని ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. సినీ ప్రముఖ నేపద్య గాయకులు మల్లికార్జున్, గోపిక పూర్ణిమ, కారుణ్య, గీతా మాధురి, జబర్దస్త్ రాంప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. ఉత్తరాంధ్ర వాసులంతా ఈ కార్యక్రమాలకు విచ్చేసి విజయవంతం చేయాలని ఆయన కోరారు.పిరమిడ్ సొసైటీ జిల్లా అధ్యక్షులు జే. రామారావు మాట్లాడుతూ ధ్యానం యొక్క విశిష్టత ప్రతి ఒక్కరికి తెలియాలని ఆశయంతో ఈ కార్యక్రమాన్ని ఎంతో ఖర్చుతో నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆనందోబ్రహ్మ కార్యక్రమ సీఈవో తులసి, జె.రామారావు, కనకమహాలక్ష్మి, రాధ, ధనలక్ష్మి , శ్రీదేవి, జగదీష్ లతో పాటు పలువురు పిరమిడ్ మాస్టర్లు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయంలో ఘనంగ ముడుపుల పూజ

విశాలాంధ్ర - సీతానగరం : మండల కేంద్రంలో సువర్ణముఖినదీ ప్రక్కనగల శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయంలో గురువారం జరిగిన ముడుపులపూజలకు పెద్దఎత్తున భక్తులు వివిధ ప్రాంతాలనుంచి తరలి వచ్చి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుండి రాత్రివరకు శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారికి ఆలయఅర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు ఆద్వర్యంలో పూజలను నిర్వహించారు. ప్రతీగురువారం శ్రీలక్ష్మి నరసింహస్వామీ దేవాలయంలో జరుగుతున్న ముడుపుల పూజలకు వారం వారం భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో అర్చకులు బ్యాచుల వారీగా పూజలు చేస్తున్నారు పెద్ద ఎత్తున వివిధ ప్రాంతాల నుండి భక్తులు విచ్చేసి భక్తిశ్రద్ధలతో, ఉపవాసాలతో పూజలు చేస్తున్నారు. భక్తులు తీసుకొని వస్తున్న పూలదండలు, పూలతో స్వామి వారి అలంకరించిన తీరు అద్భుతమని చెప్పవచ్చు. మరోప్రక్క స్వాములు మాలాధారణ ధరించడంవల్ల ఆలయాల్లో, గ్రామాల్లో స్వాముల శరణఘోషతో అయ్యప్పస్వామి నామస్మరణతో ఆధ్యాత్మికత సందడి నెలకొనడం గమనార్హం.

31న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాక

విశాలాంధ్ర - పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం: ఈ నెల కోరన్న -మంగన్న వర్ధంతి, తొలి అమర వీరులు కోరన్న మందన్న గిరిజన యావన్మంది పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా తోట జీవన పిలుపునిచ్చారు. బొమ్మల లక్ష్మీపురంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య కొండంగి లింగరాజు జిల్లా సంస్థలో పువ్వుల ప్రసాదు లక్ష్మణరావు తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ, దోపిడీ పోవాలని, పాలేరు వ్యవస్థ రద్దు చేయాలని, భూములన్ని గిరిజనులకే చెందాలని 1967లో భారత కమ్యూనిస్టు పార్టీ మొండింఖల్లో బహిరంగ సభకు బయలుదేరుతున్న గిరిజనులను పీ లేవుడి లో చావుకారు సాంబన్న వారి కాంగ్రెస్ గూండాలు అమాయకులను గిరిజనులను అడ్డగించి దాడులు చేసి కోరాన్న ను చాటుగా తుపాకితో కాల్చి,, కోరన్న ను పెద్ద బండరాయితో తలపై మోదీ చంపడం జరిగింది, కోరన్న మంగన్న ఆత్మ బలిదానం శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటానికి ఊపిరిలూదింది, కోరన్న బంగాళా తదనంతరము గ్రామ సభల పేరుతో గిరిజన రైతాంగ ఉద్యమం గూడెం గూడెంలోకి వ్యాపించింది ఉచ్చు రీత్యా ఉపాధ్యాయులైన వెంపటాపు సత్యము ఆదిభట్ల కైలాసము ఆ ఉద్యమాన్ని అందుకొని తీవ్రతరం చేయడమైనదన్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారాలు అన్న పేరుతో జరుగుతున్న గుమ్మలక్ష్మీపురం లో బి ఎస్ ఆర్ కల్యాణమండవం లో జరుగు వర్ధంతి సభకుముఖ్య వక్తలు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ కే.రామకృష్ణ గారు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ జీ.ఈశ్వరయ్య పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీనియర్ నాయకులు కామ్రేడ్ పీ.కామేశ్వరరావు తదితర నాయకులు వచ్చే ప్రసంగించుకున్నారు, ఈ వర్ధంతి సభకు గిరిజన ప్రజానికమందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

28 లోగా రీ-కౌంటింగ్‌కి దరఖాస్తు చేయవచ్చు

విశాలాంధ్ర - బెలగాం : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డిఇఐఈడి) 2వ సంవత్సరం పరీక్ష ఫలితాల రీ కౌంటింగ్‌కు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యా శాఖధికారి ఎన్. ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆగష్టులో నిర్వహించిన డిప్లొమా 2వ సంవత్సరం సప్లమెంటరీ పరీక్షలకు సుమారు 1808 మంది అభ్యర్థులు హాజరయ్యారని, వారిలో 1259 మంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారని వివరించారు. మార్కుల డమ్మీ మెమోరాండం www.hse.ap.gov. in వెబ్సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మార్కుల రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు, రీకౌంటింగ్ సబ్జెక్టును ఎంపిక చేసుకొని ఈనెల 28 లోగా ఒక్కో సబ్జెక్ట్‌కు రూ: 500 చలానాను ఎపిసిఎఫ్.ఎంఎస్ సిస్టమ్ ద్వారా మాత్రమే చెల్లించాలని, సొంత చిరునామా రాసిన ఎన్వలప్ కవర్, డమ్మీ మార్కుల మెమో నకలు దరఖాస్తుకు జత చేసి జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి ఈ నెల 28 సాయంత్రం 5 గంటలలోగా సమర్పించాలని ఆ ప్రకటనలో సూచించారు.

కొత్తవలసలో వైభవంగా దుర్గాదేవి అనుకోత్సవం

విశాలాంధ్ర - కొత్తవలస : కొత్తవలస మండల కేంద్రంలోని శ్రీ దుర్గా దేవి అమ్మవారి ఆలయంలో ఆలయ ధర్మకర్త, మాజీ ఎంపీపీ పోలమరశెట్టి రాజన్న , ఆలయ ప్రధాన అర్చకులు వెలవల లక్ష్మీ శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన దేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు బుధవారం రాత్రితో ముగిసాయి. నిత్యం మహిళలచే కుంకుమ పూజలు, ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలువురు రాజకీయ, వ్యాపార ప్రముఖులు అమ్మవారిని దర్శించి భక్తిశ్రద్ధలతో పూజించారు. విజయదశమి సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం రాత్రి అనుకోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భార్య అన్నసామారాధన, పేదలకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జిన్నాంలో పౌష్టికాహార ప్రదర్శన

విశాలాంధ్ర - గజపతి నగరం : మండలంలోని జిన్నాం గ్రామంలో గురువారం పౌష్టి కాహార ప్రదర్శన చేపట్టారు గజపతినగరం ఐసిడిఎస్ సిడిపిఓ నాగమణి ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు జడ్పిటిసి గార తౌడు వైసిపి నాయకులు బెల్లాన తినాధరావులు తిలకించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి అధ్యక్షురాలు ఎం సుభాషిని మరియు అంగన్వాడి లు పాల్గొన్నారు.

ఉపాధి హామీ వేతన కార్మికుల నిరసన ప్రదర్శన

విశాలాంధ్ర - గంట్యాడ : గంట్యాడ మండలం నరవ గ్రామంలో బుధవారము ఉపాధి హామీ డిమాండ్లపై నిరసన ప్రదర్శన జిల్లా ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు ఉపాధ్యక్షులు కాళ్ళ కృష్ణఆధ్వర్యంలో జరిగినది. పెద్ద ఎత్తున ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి ప్రధాన డిమాండ్లు 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకు 600 రూపాయలు కనీస భృతి చెల్లించాలని. వలసలు నివారించాలని. కరువు నివారణ పనులు తక్షణమే చేపట్టాలని, వ్యవసాయ కార్మిక పిల్లలకు అన్ని రకాల ఫీజులు తగ్గించాలని డిమాండ్ చేశారు. పై సమస్యలపై దేశవ్యాప్తంగా దేశవ్యాప్తంగా బీహార్ రాజధాని అయిన పాట్నా నగరంలో నవంబర్ 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు అఖిల భారత స్థాయిలో పై సమస్యల పరిష్కారం కొరకు కార్యశాల మరియు చివరి రోజున అఖిలభారత స్థాయిలో మహాసభ నిర్వహిస్తామన్నారు..

'సెలెవిడా వెల్‌నెస్'ను ప్రారంభించిన డాక్టర్ రెడ్డీస్

విశాలాంధ్ర - విజయనగరం : గ్లోబల్ ఫార్మాస్యూటికల్ కంపెనీ డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ లిమిటెడ్, నేడు తన పూర్తి యాజమాన్యంలోని అనుబంధ సంస్థ స్వాన్ వెల్‌నెస్ లిమిటెడ్ ద్వారా మధుమేహ రోగుల కోసం తన మొదటి డైరెక్ట్-టు-కన్స్యూమర్ ఇ-కామర్స్ వెబ్‌సైట్ 'సెలెవిడా వెల్‌నెస్'ని ప్రారంభించామని ప్రకటించింది. టైప్ 2 డయాబెటిక్, ప్రీ-డయాబెటిక్ వ్యక్తుల కోసం వ్యక్తిగతీకరించిన డయాబెటిక్ సంరక్షణ అందించేందుకు 'సెలెవిడా వెల్‌నెస్' ఒన్-స్టాప్ పరిష్కారంగా మారాలని లక్ష్యంగా పెట్టుకుందని ఎం.వి. బ్రాండెడ్ మార్కెట్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమణ చెప్పారు. డయాబెటిక్ రోగి రోజువారీ పోషకాహార అవసరాన్ని చూసుకునే మరియు అదే సమయంలో రోజులో మొత్తం పూర్తి సందర్భానికి గతిన ఉత్పత్తి పోర్ట్‌ఫోలియోను అందించేందుకు వెబ్‌సైట్ సెలెవిడా శ్రేణి ఉత్పత్తులను, అలాగే ఇతర థర్డ్ పార్టీ బ్రాండ్‌లు అంటే, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం, స్నాక్స్, పానీయాలు, భోజనం రీప్లేస్‌మెంట్ మొదలైన వాటిని హెరాస్ట్ చేస్తుందన్నారు. ఉత్పత్తులు వాటి పోషక కూర్పుపై కఠోరమైన శ్రద్ధతో కూడిన అధ్యయనంతో, కఠినమైన ఉత్పత్తి ఎంపిక ప్రక్రియ తర్వాత ప్లాట్‌ఫారమ్‌లో అందుబాటులో ఉంచుతారని, వెబ్‌సైట్‌లో పేర్కొన్న ఉత్పత్తులను ప్రస్తుతం భారతదేశం వ్యాప్తంగా 18,000 కన్నా ఎక్కువ పిన్ కోడ్‌లకు సేవలు అందించనున్నామని చెప్పారు.

ఘనంగా అయ్యప్ప పూజలు

విశాలాంధ్ర - తెర్లాం : మండలంలో పెరుమాలి గ్రామంకు చెందిన సత్యన్నారాయణ కోవులలో కొత్తగా మండపం నిర్మించుకుని సుమారు 40 మంది అయ్యప్ప పూజులు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు . 41 రోజు దీక్షలు చేస్తూ అయ్యప్ప కొండకు వెళ్లేందుకు దట్టమైన చలికి లెక్క చెయ్యకుండా ఈ 41 రోజు ఉదయం సాయింత్రం పూజలు నిర్వహి స్తామని భక్తులు చెప్పన్నారు. ఇందులో భాగంగా రోజుకొక భక్తులు అన్నదానం కార్యక్రమం వందల మంది నిర్వహిస్తామని, అందులో భాగంగా గురువారం గరే రాము అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజలకు పలు గ్రామాల భక్తులు హాజరు అయ్యారు.

పెదభోగిలి-2 సచివాలయంలో జగనన్నఆరోగ్య సురక్ష

ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర - సీతానగరం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలోని ప్రజలఆరోగ్యంకోసం, రోగులబాధలు నివారణకోసం అమలుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వరమని, దీనికి అన్నిసచివాలయంలలో, గ్రామాల్లో అనూహ్య స్పందన లభిస్తోందని ఎమ్మెల్యే అలజింగి జోగారావు తెలిపారు. గురువారం నాడు మండలంలోని పెదభోగిలి -2గ్రామ సచివాలయంలో జగనన్న అరోగ్య సురక్ష కార్యక్రమాన్ని స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సందర్శన చేశారు.శిబిరంవద్ద ఏర్పాటుచేసిన కౌంటర్ల ద్వారా అందజేస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. సీతానగరం, అప్పయ్య పేట, బుడ్డిపేటగ్రామాలకు చెందిన 350మందికి పైగా రోగులకు వైద్యసేవలు అందించామని వైద్యులు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్య క్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య వైద్యశిబిరంలో సీతానగరం, పెదంకలం పిహెచ్‌సి వైద్యులు, శిరీష, ఉషారాణి రాధాకాంత్,ప్రభుతేజా, స్పెషలిస్టు వైద్యులు, అపర్ణబాల, శ్యామల, పవిత్ర, ప్రసాద్,జగదీష్ లు తనిఖీలు నిర్వహించి మందులను అందజేశారు. కొంత మందిని పెద్ద ఆసుపత్రులకు రిఫర్ కూడా చేశారు.104సిబ్బంది ప్రసాద్, ఈశ్వర రావులు కూడా పాల్గొని సేవలు అందించారు .అంగన్వాడీ సిబ్బంది పౌష్టికాహారం స్టాల్ ఏర్పాటు చేయగా ఐసీడీఎస్ పిఓ సుగుణ, సూపర్ వైజర్ పూర్ణిమలు పాల్గొని దీనివల్ల కలిగే ఉపయోగాలు వివరించారు.పోషకాహార విలువలు కలిగిన ఆహార పదార్థాలు ఎక్కువగా వాడాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములు, జడ్పీటీసీ మామిడి బాబ్జి, మండల వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు, ఎంపిడిఓ కృష్ణ మహేష్ రెడ్డి, ఈఓపిఆర్డీవర్మ, ఎంఈఓలు సూరి దేముడు,వెంకటరమణ,సిహెచ్ఓ ఎస్వీరమణ, హెచ్ వి భవానీ, హెచ్ఎస్ శర్మ, సర్పంచ్ తేరేజమ్మగరికయ్య,ఎంపీటీసీలు బురిడి కుసుమ కుమారి సూర్యనారాయణ, ఎస్ గౌరీ కిరణ్, ఆర్వీ పార్థసారథి,సురేష్,రమేష్,శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది ఈఓ వెంకటరావు, కార్యదర్శి సుధారాణి, విఆర్ఓలు సింహాచలం, కుమార్,పల్లవి, దివ్యగాయత్రి, సంతోష్ కుమార్, గౌతమి, సుధీర్, సింహాచలమమ్మ,కుమారి, సంధ్య, సునీత, వివిధ సచివాలయాల సిబ్బంది, వైద్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు, వాలంటీర్లు,గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శిబిరం వద్ద ఏర్పాటు చేసిన నమోదు స్టాల్, మందుల స్టాళ్లు, హెల్ప్ డెస్క్ అంగన్వాడీ స్టాళ్లు తదితర ఏర్పాట్లను వచ్చిన వారంతా పరిశీలించారు.

బెలగాం : పార్వతీపురం మండలం క్రిష్ణపల్లి గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) కార్యక్రమాన్ని పెదబొండపల్లి పిహెచ్సి వైద్య అధికారి డాక్టర్ అనూష ఆధ్వర్యంలో బందలుప్పి పిహెచ్ వైద్యాధికారి డాక్టర్ తిరుమల ప్రసాద్ రోగులకు తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో అన్ని వైద్య కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని పలు ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి అన్ని రక్త పరీక్షలు చేసి వారికి కావలసిన మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఈ వైద్య శిబిరానికి స్పెషలిస్ట్ వైద్యులు రావడం జరుగుతుందని, రిఫరల్ అవసరమైన వారిని గుర్తించి జిల్లా హాస్పిటల్ కి పంపించడం జరుగుతుందన్నారు. లెప్రసీ లక్షణాలు ఉన్నవారు, పిల్లల్లో పుట్టుక లోపాలు గుర్తించడం గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం పై అవగాహన కల్పించుతున్నామని తెలిపారు. కావున ప్రజలు ఈ వైద్య సేవలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోను లక్ష్మి, వైద్యులు డా. ధరణి, ఎంపిహెచ్ ఈఓ వెంకటనాయుడు, హెల్త్ సూపర్ వైజర్ శంకర్రావు, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిషేధిత పదార్థాల రవాణా పై నిఘా పెట్టాలి

విశాలాంధ్ర పార్వతీపురం టౌన్ : నిషేధిత పదార్థాల రవాణాపై నిఘా పెట్టాలని స్పెషల్ ఎంఫోర్స్మెంట్ బ్యూరో డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి అన్నారు. గురువారం అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులను ఆకస్మిక తనిఖీలు చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో కమిషనర్ ఆంధ్రప్రదేశ్ రవి ప్రకాష్, ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులు కూనేరు పీ కొనవలస చెక్ పోస్టులను ఆకస్మికంగా తనిఖీలు చేసి విధుల్లో ఉన్న సిబ్బందికి తగు సూచనలు ఇవ్వడం జరిగిందని, వాహనాలను నిరంతరం తనిఖీ చేయాలని అలాగే గంజాయి, అక్రమ మద్యం మరియు సారా లాంటి నిషేధిత పదార్థాలను ఆంధ్ర ప్రాంతానికి రాకుండా నిరోధించాలని ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం యస్ఈబి ఇన్స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర పాల్గొన్నారు.

4 లీటర్ల నాటుసారాతో వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర - బొబ్బిలి : స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ ఆర్.జైభీమ్, ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని రామభద్రపురం మండలం కొండ కెంగువ గ్రామానికి చెందిన పొగందొర వెంకట రమణ అను వ్యక్తి 04 లీటర్లు నాటుసారా రవాణా చేస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎవరైనా నాటుసారా విక్రయిస్తే 9440902372కు సమాచారం ఇవ్వవలసినది గా కోరారు. ఈ దాడుల్లో ఎస్.ఐ. చిన్నం నాయుడు, సిబ్బంది హెచ్‌సి మాధవి దేవి, చంద్ర ప్రసాద్, ఆదినారాయణ, జయరాం నాయుడు, సరస్వతి లు పాల్గొన్నారు.

పునాదుల స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలి

విశాలాంధ్ర - నెల్లిమర్ల : పునాదుల స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను తక్షణమే ప్రారంభించాలని మండల ప్రత్యేకాధికారి వి శ్రీనివాస రావు అన్నారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో 82 ఇళ్లు పునాది స్థాయిలో ఉన్నాయని, వాటిని వారంలోగా ప్రారంభించాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన వాటికి బిల్లు చెల్లింపులు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ పవన్, వార్డు ఎమినిటీ కార్యదర్శి దినేష్, వర్క్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ ఉన్నారు.

ఎంఈఓ పాఠశాల పరిశీలన

విశాలాంధ్ర -తెర్లాం : మండలంలో వి. చిన్న య్యపేట ఎంపిపి స్కూల్‌ను గురువారం పరిశీలించిన ఎంఈఓ జే.తిర్థాధరావు. స్కూల్ యొక్క అసెంబ్లీను, విద్యార్థుల చదువు తీరుని, వర్క్ బుక్స్ కరెక్షన్‌ను పరిశీలించారు. ఎఫ్ ఎస్2 ఎగ్జాం ఎనాలిసిస్‌ను, టీచర్స్ లెసన్ ప్లాన్స్‌నీ విద్యార్థుల డైరీస్ ను పరిశీలించారు. మరుగుదొడ్లను మధ్యాహ్న భోజనం ను జే వి కే వినియోగం ను మరియు తదితర అంశాలను తనిఖీ చేశారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యత

మండల విద్యాశాఖధికారి భాస్కరరావు

విశాలాంధ్ర - వేపాడ : ప్రభుత్వం విద్య వైద్యానికి ప్రధమ ప్రాధాన్యత కల్పిస్తోందని మండల విద్యా శాఖధికారి పి బాల భాష్కరరావు అన్నారు. మండలంలోని అన్నిపాఠశాలలకు జగనన్న గోరు ముద్దకు సంబంధించి ప్రభుత్వం నూతనంగా సమకూర్చిన వంటపాత్రలను, క్రీడా సామాగ్రిలను గురువారం ఆయన పంపిణీ చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న గోరుముద్దలు, క్రీడా సామగ్రిలతో విద్యార్థుల ఆరోగ్యం మరెంతగానో ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా బాగా రాణించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమం లో సిఆర్పీలు, ఎమ్మార్సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రిఫరల్ కేసులను పర్యవేక్షించాలి : జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర -విజయనగరం / బొండపల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో పరీక్షల అనంతరం అవసరమైన వారిని తదుపరి చికిత్సలకు నెట్‌వర్కు ఆసుపత్రులకు రిఫర్ చేయడమే కాకుండా, వారు పూర్తిగా వైద్య చికిత్స పొందేవరకు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. వారందరికీ ఆరోగ్యశ్రీ పథకం క్రింద మెరుగైన వైద్యం అందేలా చూడాల్సిన బాధ్యత వైద్యాధికారులపైనే ఉందని స్పష్టం చేశారు. బొండపల్లి మండలం బి.రాజేరు, విజయ నగరం మండలం గొల్లలపేటలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్, కౌంటర్లు, వైద్యులు, వైద్యసేవలు, ఇస్తున్న మందులు, నిర్వహిస్తున్న పరీక్షలు, రిఫరల్ కేసులపై ఆరా తీశారు. శిబిరానికి హాజరైన రోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నవంబరు 15 నాటికి జిల్లా అంతటా ఆరోగ్య శిబిరాల నిర్వహణ పూర్తి అవుతుందన్నారు. ఒక గ్రామంలో శిబిరం పూర్తి అయిన వెంటనే రిఫరల్ కేసులపై పూర్తిగా దృష్టి పెట్టి, వారికి తదుపరి వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

శిబిరాల్లోనే ఆరోగ్యశ్రీపై పూర్తిస్థాయిలో రోగులకు అవగాహన కల్పించి, వారు నెట్‌వర్కు ఆసుపత్రులకు వెళ్లేవిధంగా చూడాలన్నారు. అలాగే శిబిరాల్లో సుగర్, బిపి లాంటి వ్యాధులు బయటపడితే, వారి ఆరోగ్యాన్ని ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా పర్యవేక్షించాలని సూచించారు. అటువంటి రోగులకు నెలనెలా ఉచితంగా మందులను అందించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమాల్లో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ భాస్కరరావు, బొండపల్లి ఎంపిడిఓ రాజేంద్రప్రసాద్, ఇన్‌ఛార్జి తాశిల్దార్ శంకర్రావు, విజయనగరం ఎంపిడిఓ జి.వెంకటరావు, డిటి కోటేశ్వర్రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు.

2,600 ఎకరాల్లో పంట నష్టం

జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా, ఇప్పటివరకు సుమారుగా 2,600 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లుగా గుర్తించడం జరిగిందని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఆమె బి.రాజేరులో విలేకర్లతో మాటాడుతూ, జిల్లాలో వర్షాభావ పరిస్థితిని వివరించారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యిందని చెప్పారు. తాజాగా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో, ఈ నెలాఖరులోగా వర్షాలు కురిసే అవకాశం ఉందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అయినప్పటికీ వ్యవసాయశాఖ సిబ్బంది, గ్రామ వ్యవసాయ కార్యదర్శులు నిరంతరం పంటలను పర్యవేక్షిస్తూ, ఎండి పంటలను నమోదు చేయడం జరుగుతోందని చెప్పారు. అవసరమైన చోట రైతులకు తగిన సలహాలను, సూచనలను ఇస్తూ, పంటను రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కాలువల ఆయుకట్టు భూములకైనా సక్రమంగా నీరు అందించి, పంటలకు కాపాడుకునేందుకు చర్యలను తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు.